క్లుప్తంగా

ప్రారంభోత్సవానికి సిద్ధం


గ్రామ సచివాలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. వందగల్లు గ్రామంలో వందగల్లు, నేల కోసిగి గ్రామాల ప్రజలకు సచివాలయ సేవలు అందించేందుకు రూ.43.50 లక్షల నిధులతో కార్యాలయం భవనం నిర్మాణ పనులు పూర్తి చేశారు. త్వరలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కాల్వ లక్ష్మయ్య పేర్కొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు


గుడికంబాలిలో సిమెంటు రోడ్డు, కల్వర్టు నిర్మాణం

కౌతాళం: మండల పరిధిలోని గుడికంబాలి గ్రామంలో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణ పనులను ముమ్మర్మంగా చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ సిద్ధేశ్ తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామంలోని ఎస్సీ కాలనీకి రూ.10 లక్షలు నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. 150 మీటర్ల వరకు డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఒక కల్వర్టు, సిమెంటు రోడ్డు పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులను విడతల వారీగా చేపడుతున్నట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఆదోని సెంట్రల్: ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు పొడగించినట్లు పురపాలక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ కె.మల్లికార్జున మంగళవారం తెలిపారు. అర్హత కలిగి 10వ తరగతి, ఇంటర్ చదవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతి చదివేందుకు టీసీ కలిగి 14 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్ చేరదలిచిన వారు 10వ తరగతి ఉత్తీర్ణులైనట్లు సర్టిఫికెట్ ఉండి 15 సంవత్సరములు నిండి ఉండాలన్నారు. అధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, టీసీ, 10వ తరగతి మార్క్స్ కార్డు, ఫొటోలతో దగ్గర్లోని ఆన్‌లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుదన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ


పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదోనిఅర్బన్: ఆదోని డాక్టర్లు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగో విడత పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ మేరకు 34 మంది టీబీ రోగులకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పౌష్టికాహార కిట్లను అందజేసినట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఆరు నెలల పాటు టీబీ మందులు, పౌష్టికాహారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి వారు వాడే మందులు కూడా బాగా పనిచేస్తాయన్నారు. క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం లాంటివి చేయాలన్నారు. డాక్టర్ క్రిష్ణమూర్తి, టీబీ ఆఫీసర్ షేకున్‌బాను, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, ఈసీ మెంబర్ ఓంప్రకాష్, వన్నపరాజు, టీబీ స్టాఫ్ బాబురాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం


తుంగభద్ర నది తీరంలో గంగమ్మ పూజల్లో పాల్గొన్న మత్స్యకారులు

మంత్రాలయం: మత్స్యకారులు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య సూచించారు. మంగళవారం మంత్రాలయంలోని తుంగభద్ర నది ఒడ్డున జాతీయ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకుని గంగమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్రులు స్టీమర్ రాఘన్న, అంజినయ్య, సుంకప్ప, బంగి బీమయ్య, లింగప్ప, పౌర రాఘవేంద్ర, గుండ్రాయి రాముడు, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకే జనం మద్దతు


ఎస్కేడీ కాలనీలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ నాయకులు


ఆదోనిలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, పట్టణ కన్వీనర్ మధుసూదనశర్మ, క్లస్టర్–1 అధ్యక్షులు మహ్మద్ స్వామి అన్నారు. మంగళవారం 21వ వార్డులోని ఎస్కేడీ కాలనీ వార్డు సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని కౌన్సిలర్ రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవా, మధుసూదన్‌శర్మ మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో అలవిగాని 600 హామీలు ఇచ్చి సీఎం అయ్యాక చంద్రబాబునాయుడు ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. కోట్లకు కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 యేళ్లపాటు సీఎంగా కొనసాగి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని చెప్పారు. అక్కాచెల్లెమ్మలను పసుపు, కుంకుమ పథకం కింద దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. మహిళా లోకం ఆగ్రహావేశాలకు 2019లో నామరూపాలు లేకుండా కొట్టుకుపోయారన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని నమ్మబలికి యువతను నట్టేట ముంచారని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగనన్నకు మరోసారి అండగా నిలవాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు తాయన్న, దుర్గప్ప, విశ్వనాథరావు, శ్రీనివాసరెడ్డి, రమేష్, గోపాల్, కుజ్జాస్, తిక్కన్న, అన్ను తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విజయాన్ని ఎవరూ ఆపలేరు

కోసిగి: రాష్ట్రంలో ప్రతిపక్షాలన్నీ కలిసివచ్చినా రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని ఆపలేరని జేసీఎస్ మండల కన్వీనర్ పి.మురళీమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం కోసిగి మండలంలోని వందగల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామంలోని ప్రధాన రోడ్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయ కార్యాలయానికి వెళ్లి సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి వంద శాతం హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజల మద్దతు సేకరించాలన్నారు. గత చంద్రబాబునాయుడు పథకాల అమలు తీరు, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించాలన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో న్యాయం జరిగి ఉంటే ఓటు వేయాలని నిర్భయంగా అడగాలని సూచించారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, మహంతేష్, బుళ్లి నరసింహులు,సర్పంచ్ కొరవంజమ్మ, కాల్వ లక్ష్మయ్య, వెంకటరెడ్డి, నేలకోసిగి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు సుబ్బరాజు, రాఘవేంద్రరెడ్డి, ఉలిగయ్య అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కామవరం రోడ్డు, హనుమన్ నగర్‌లో ఇంటింటికీ తిరిగి 'ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ఎంతమేర లబ్ధిపొందారో తెలుపుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. గృహసారథులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యం.తాండలో..

మంత్రాలయం: మంత్రాలయం మండల పరిధిలోని యం.తండా గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి సమక్షంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి జగనన్నకు మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


వందగల్లులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


కౌతాళంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న నాయకులు


యం.తండాలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


బల్లేకల్‌లో దివ్యాంగుడి కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుందాం
- ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- బల్లేకల్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆదోనిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని, గ్రామాల్లోని ప్రతి గడపకు తిరుగుతూ స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సీఎంగా మరోసారి జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బల్లేకల్ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసా, వైఎస్సార్ ఉచిత పంటలబీమా, పెన్షన్ కానుక, చేయూత, తదితర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికి రూ.3 లక్షలు మేర లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువ చేశారని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. సచివాలయం నిధులు రూ.20 లక్షలతో డ్రెయినేజీ కాలువలు, సీసీ రోడ్ల పనులకు ఎస్టిమేషన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో రెండు సచివాలయ నిర్మాణ పనులు, రెండు రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరాజు, హౌసింగ్‌బోర్డు అధికారి తిక్కన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, సర్పంచ్ లోకేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మండలంలోని బల్లేకల్ గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి సీఐటీయూ, డీవైఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని, మిద్దెలపై ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలని, స్కూల్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి మార్చాలని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు


అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని 1వ వార్డు వాల్మీకి నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణంపై ఆ ప్రాంత ప్రజలతో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి చర్చించారు. లేఅవుట్, మున్సిపల్ ఖాళీ స్థలాల్లో సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం వాల్మీకినగర్‌లో కమిషనర్, టీపీఓ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు కృపాకర్, డీఈ నాయక్, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులతో కలిసి కలియతిరిగారు. ఎక్కడెక్కడ రోడ్లు, కాలువలు అవసరమో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారి అవసరం మేరకు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. అనంతరం బసాపురం ఎస్ఎస్ ట్యాంకును కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డీఈ రవి పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ట్యాంకు బండ్ పనులను వారు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎంఈ రాధాకృష్ణ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మించండి


దెబ్బతిన్న సంపు పైకప్పును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని ఎంఐజీ కాలనీలో ఉన్న మంచినీటి స్టోరేజీ సంపు పైకప్పు భాగంలో మరమ్మతులు చేపట్టి, కాంపౌండ్ వాల్ నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ నాయకులు తిప్పన్న కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంఐజీ కాలనీలోని ట్యాంకు దగ్గ ఉన్న సంపును వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఆదోని మున్సిపాలిటీ మంచినీటి కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి రాంజల వద్ద నీటిని ఫిల్టర్ చేస్తూ సంపులకు సరఫరా చేస్తోందన్నారు. అయితే ఎంఐజీలో ఉన్న సంపు పైకప్పు దెబ్బతినడంతో చుట్టుపక్కల పిల్లలు ఆడుకుంటూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పెద్దహరివాణం గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు రక్షణ గోడ లేకపోవడంతో ఇటీవల ఇద్దరు చిన్నారులు మృతి చెందారని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటన ఆదోని పట్టణంలో జరగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు.

చేసిన మేలును వివరించండి


మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్మిక శాఖ మంత్రి గమ్మనూరు జయరాం స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. అందులో.. ప్రతి గ్రామ సచివాలయంలో పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి మళ్లీ వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇచ్చేలా కృషి చేయాలని పేర్కొన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని సూచించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మళ్లీ వైఎస్ జగనన్న సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించాలని ప్రకటన ద్వారా దిశానిర్దేశం చేశారు.

మత్స్య పరిశ్రమకు ప్రోత్సాహం

వెల్దుర్తి(కృష్ణగిరి): మత్స్య పరిశ్రమకు ప్రోత్సాహం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం వెల్దుర్తి హైవేలో పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్ర' సూపర్ రెస్టారెంట్, వెండింగ్ వెహికల్‌ను జిల్లా మత్స్య శాఖాధికారి శ్యామలతో కలిసి ప్రారంభించారు. 60 శాతం సబ్సిడీతో రూ.20లక్షల రెస్టారెంట్ యూనిట్ పొందిన వెల్దుర్తికి చెందిన లబ్ధిదారులు వెంకటేశ్వరమ్మ, కర్ణ దంపతులు, వేణుగోపాల్, చేపలు, రొయ్యల రవాణాకు ఉపయోగించేందుకు 40 శాతం సబ్సిడీతో రూ.20 లక్షల వెండింగ్ వెహికల్ (ఐచర్ ఫోర్‌వీలర్) పొందిన లబ్ధిదారుడు నర్సాపురం శీలం వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. యూనిట్ల ప్రారంభం అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు రెస్టారెంట్‌లోని పలు వంటకాలను రుచి చూశారు. వాహనం వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారునికి అందించారు. ఆక్వా రైతులు సేకరించిన చేపలు, రొయ్యలను 'ఫిష్ ఆంధ్ర' బ్రాండ్ ద్వారా మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చి దేశీయ వినియోగం పెంచడం తమ లక్ష్యమన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ శివరాముడు, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, మత్స్య శాఖ ఏఎఫ్‌ఐ బాలరాజు, ఎఫ్‌బీఓ స్వర్ణలత, డీపీఎం రాజేశ్, వీఎఫ్ఏ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యం ప్యాకెట్లు, ఆటోను స్వాధీనం చేసుకున్న మాధవరం చెక్‌పోస్ట్ పోలీసులు


పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్ఐ వేణుగోపాల్ రాజు

మంత్రాలయం: మండల పరిధిలోని మాధవరం చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు చెక్ పోస్ట్ సీఐ శేషాచలం, ఎస్ఐ సోమశేఖర్‌రావు తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆదేశాల మేరకు మాధవరం చెక్‌పోస్ట్ వద్ద అక్రమ రవాణా జరగకుండా తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏపీ 21 టీఈ 2969 నంబర్‌గల మహేంద్ర ఆటోలో ఐదురుగు వ్యక్తులు 5 బాక్స్‌లలో 480 (90 ఎంఎల్) కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన రెడ్డయ్యగారి హరినాథ్ రెడ్డి, ఎమ్మిగనూరుకు చెందిన మాలదాసరి పద్మావతి, బి.లక్ష్మీ, బారికి సరోజగా గుర్తించినట్లు చెప్పారు. ఆటోను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు గౌస్ రబ్బానీ, గోపాల్, లింగప్రసాద్, షరీఫ్, కానిస్టేబుల్స్ రామచంద్రుడు, నరసింహా రెడ్డి, ఇందుమతి పాల్గొన్నారు.

తుంగభద్ర నది సంత మార్కెట్ వద్ద ఆస్పరి మండలం బనవనూరు గ్రామానికి చెందిన బోయ నడిపి రంగడు కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు. మంగళవారం రాబడిన సమాచారం మేరకు ఆయన్ను పట్టుకుని 294 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మాధవరంలో..

మాధవరం సర్కిల్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఆదోనికి చెందిన కమలే యువరాజు అక్రమంగా మద్యం తరలిస్తు పట్టుబడినట్లు మాధవరం ఎస్ఐ కిరణ్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 192 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పెంటర్ దుకాణంలో చోరీ

ఆదోనిఅర్బన్: పట్టణంలోని మాధవరం రోడ్డు నూతన ఓవర్‌బ్రిడ్జి కింద దేవీనగర్‌లోని కార్పెంటర్ దుకాణంలో రాత్రి దొంగతనం జరగ్గా మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. యథావిధిగా ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లిన యజమాని వీరయ్యస్వామి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించారు. తలుపులు తెరుచుకొని లోపలికి వెళ్లి చూడగా దుకాణంలోని డ్రిల్లింగ్, కటింగ్ మిషన్లు చోరీకి గురైనట్లు తెలిసింది. వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని వీరయ్యస్వామి తెలిపారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వీరయ్యస్వామి పేర్కొన్నారు. ఇదిలాఉండగా ఆ ప్రాంతంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో మండలంలో జరిగిన అభివృద్ధి, జరుగుతున్న, చేపట్టాల్సిన పనులు, వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అన్ని శాఖల అధికారులతో చర్చించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు కార్యదర్శి చెన్నయ్య, సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. డ్రైనేజీల్లో పెరుకుపోయిన చెత్త చెదారంను తొలగించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్, దర్గా ఏరియాల్లో సిబ్బందిచే పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వారు తెలిపారు.

ఆహ్లాద 'వన' విహారం

- ఆదోని పట్టణ శివారులో మరో నగర వనం
- కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని 39.40 హెక్టార్లలో ఏర్పాటు
- నగర వన యోజన పథకం కింద రూ.2 కోట్ల నిధులు
- నగర వాసులు సేదతీరేలా సుందరీకరణకు చర్యలు



ఆదోని నగర వనం ఏర్పాటు కానున్న కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో నగర, పట్టణ వాసులు సేద తీరేలా నగర వనాలను అభివృద్ధి చేస్తున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో త్వరితగతిన నగర వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కర్నూలు మండల పరిధిలో కర్నూలు నగర వనం, డోన్ మున్సిపాలిటీ పరిధిలోని నగర వనాల్లో సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కర్నూలు నగర శివారు కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిలో విజయ వనం పుల్లయ్య పార్క్‌లో సుందరీకణ పనులు పూర్తి చేసి అభివృద్ధి చేశారు. దీన్ని త్వరలో నగర వాసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటితో పాటు నగర వన యోజన పథకం కింద ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 39.40 హెక్టార్లలో రూ.2 కోట్ల నిధులతో మరో నగర వనాన్ని అభివృద్ధి చేయనున్నారు.

నగర వనంలో చేపట్టనున్న పనులు

నగర వనం ప్రధాన ద్వారం ఆర్చ్, పార్క్, వాకింగ్ ట్రాక్, బైస్కిల్ ట్రాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఈఈసీ), చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్, ల్యాండ్ స్కేపింగ్, చైన్ లింక్ ఫెన్సింగ్, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు.

నగర వనాల అభివృద్ధికి చర్యలు



నగర, పట్టణ వాసులు సేద తీరేలా నగర వనాలను అభివృద్ధి చేస్తున్నాం. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలో నగర వన యోజన పథకంలో కేంద్ర నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో మరో నగర వనం ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే రూ.1.40 కోట్ల నిధులు కేటాయించారు. ఈ వారం లోగా నిధులు మంజూరు కానున్నాయి. వెంటనే పనులు ప్రారంభమవుతాయి. త్వరలోనే నగర వనం అందుబాటులోకి తీసుకొస్తాం.

– పి.శివశంకర్‌రెడ్డి, జిల్లా అటవీ శాఖాధికారి, కర్నూలు

దారికాచి వ్యక్తిపై దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు రామలింగప్ప

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామానికి చెందిన రామలింగప్పపై దారికాచి కర్రతో దాడి చేసిన సంఘటన కోసిగి గ్రామ శివారుల్లో చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామానికి చెందిన రామలింగప్ప పంట పొలాలకు పురుగు మందులు కొనుగోలు చేసేందుకు కోసిగికి వచ్చాడు. కోసిగిలో సంత, పురుగు మందులు కొనుగోలు చేసి తిరిగి గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గం మధ్యలో కోసిగికి చెందిన మాధవరెడ్డి కాపుకాసి రామలింగప్పపై కర్రతో దాడి చేశాడు. దీంతో రామలింగప్ప తలకు రక్తగాయమైంది.

వెంటనే కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఐరన్‌గల్లు గ్రామంలో దాయాదుల గొడవలు ఉన్నాయని, కోసిగిలో ఉన్న బంధువులతో గొడవలు ఉన్నాయని అది మనసులో పెట్టుకుని దాడి చేయించినట్లు బాధితుడు ఆరోపించాడు. ఈ మేరకు కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.